క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆవేటి వారాలు



ముర్రాటలతో వెళ్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఖరీఫ్ పంటలు సమృద్ధిగా పండి రైతులు సభిక్షంగా ఉండాలని కోరుతూ చినవంక గ్రామంలో ఆదివారం ఆవేటి వారోత్సవాలు నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు ముర్రాటలు, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం



రవిని సన్మానిస్తున్న అధికారులు

కంచిలి: సార్వత్రిక ఎన్నికల ముందు విశాఖపట్నం జిల్లా నుంచి స్థానిక తహశీల్దార్‌గా చేరి విధులు నిర్వర్తించిన ఎం.వి.కె.ఎస్.రవి బదిలీపై మళ్లీ విశాఖపట్నం జిల్లాకు వెళ్లనుండటంతో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.నీరజ, ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, డీటీ సంతోష్, ఆర్‌ఐ అపర్ణ, సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సచివాలయ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఔదార్యం



రోగులకు పండ్లు, నగదు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందున బాధితులకు పలాస క్యాజువల్యాండ్ లయన్స్ క్లబ్ తరఫున ఆర్థిక సహాయం, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి.రాజారాం, సెక్రటరీ పెంట శివకుమార్, అట్టాడ మాధవరావు, ఎరుకోలు సత్యారావు, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'శిక్షా సప్తాహ్'

కంచిలి: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం-2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

టెక్కలి రూరల్: స్థానిక గొల్లవీధికి చెందిన బర్ల కృష్ణ అనే నిరుపేద రోగి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి మండలానికి చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ తరఫున నగదు, నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసినట్లు సంస్థ ప్రతినిధి షణ్ముఖరావు ఆదివారం తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తం

కాశీబుగ్గ: పలాస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా అవగాహన కల్పించాలన్నారు.

కృష్ణారావుకు జ్ఞానసరస్వతి అవార్డు



ఇచ్ఛాపురం: నృత్య మాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ ప్రదానం చేయనున్న జ్ఞాన సరస్వతి అవార్డుకు స్థానిక గాయకుడు ఆశి కృష్ణారావు ఎంపికయ్యారు. బోనాల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే ఇండియా లెవల్ డ్యాన్స్‌ఫెస్ట్-2024లో అవార్డు ప్రదానం చేస్తారని గాయకుడు పేర్కొన్నారు.

ఉధృతంగా బెండిగెడ్డ



బెండి గెడ్డ ప్రవాహం

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు ముంచెత్తాయి. దీంతో కాలువలు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నారుమడులు, వెద పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. రోడ్లు జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కొండలపైనుంచి వరద నీరు చేరడంతో బెండి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది.

మత్స్యకారులకేదీ భరోసా?

- వేట నిషేధం కాలం పూర్తయి నెల దాటినా దక్కని సాయం
- రీసర్వే పేరిట కూటమి ప్రభుత్వం కాలయాపన



వల నుంచి చేపల్ని వేరు చేస్తున్న మత్స్యకారులు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా వేట నిషేధ భృతి సాయం అందకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తల్లికి వందనం మాదిరిగానే మత్స్యకార భరోసాపైనా మెలిక పెట్టి రీసర్వే పేరుతో కాలయాపన చేస్తుండటంపై పలువురు మండిపడుతున్నారు. వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాలు కారణంగా మత్స్యకారుల వేట సక్రమంగా సాగడం లేదు. ఈ సమయంలో వేట నిషేధ సాయం అందితే కొంత భరోసాగా ఉండేదని చెబుతున్నారు.

గంగపుత్రుల్లో గందరగోళం..

కొత్త ప్రభుత్వం తీరు గంగపుత్రుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధం ఉంటుంది. ఈ సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. ఈ ఏడాది మాత్రం నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ రూ.10వేలు చొప్పున అందుకున్నారు. దీంతో మత్స్యకారులు అవస్థలు పడకుండా వేట నిషేధ సమయాన్ని పూర్తి చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ భృతి మంజూరుపై నిర్ణయం చేయకపోవడందో ఆందోళన చెందుతున్నారు.

మండలం	లబ్ధిదారుల సంఖ్య
ఇచ్ఛాపురం	328
కవిటి	2047
సోంపేట	1297
కంచిలి	---

అమలుపై అనుమానాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భరోసాను రూ.10వేల నుంచి రూ.20 వేలు పెంచుతామని హామీ ఇచ్చింది. దీనిపై కొంతమంది మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు ఇప్పటి వరకు సర్వే చేసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 3,672 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రూ.20వేలు చొప్పున రూ.73,440 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

రీసర్వే పేరిట కాలయాపన..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో వేట నిషేధ కాలంలో మత్స్యకారులు ఇంటి వద్దనే ఉంటూ వలల్ని మరమ్మతుల్ని చేసుకున్నారు. ఈ క్రమంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్ష సర్వే ద్వారా అర్హుల్ని గుర్తించి వారికి పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేసేవారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండు నెలల క్రిందటే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అర్హుల్ని గుర్తించారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీసర్వే అంటూ మెలిక పెట్టింది. గత టీడీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రూ.4వేలు ఇస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాన్ని రూ.10 వేలకు పెంచింది. అయితే కూటమి ప్రభుత్వం రీసర్వే పేరుతో కొందరిని జాబితా నుంచి తొలగిస్తారనే అనుమానాలు మత్స్యకారుల్లో ఉన్నాయి.

ఎప్పుడిస్తారో?



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలోనే మత్స్యకార భరోసా పథకం ద్వారా లబ్ధిదారులందరికీ నేరుగా బ్యాంకు ఖాతాలకే రూ.10వేలు చొప్పున వేసేవారు. కొత్త ప్రభుత్వం వేట నిషేధ భృతి ఎప్పుడిస్తారో చెప్పడం లేదు.

– మాగుపల్లి జనార్ధనరావు, లబ్ధిదారుడు, డొంకూరు

రీసర్వేతో గుబులు



ఎన్నికలకు ముందే మత్స్యశాఖాధికారులు మా గ్రామాలకు వచ్చి అర్హులైన వారిని గుర్తించారు. ఇప్పుడేమో రీసర్వే అంటూ మా గుండెల్లో గుబులు రేపుతున్నారు. ఎవరిని తొలగిస్తారోనన్న అనుమానం ఉంది. అర్హులైనవారందరికీ పథకం వర్తింపజేయాలి.

– బుద్ధ కళ్యాణ్, మత్స్యకార ఐక్యవేదిక సభ్యుడు, డొంకూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే చేస్తాం. ప్రభుత్వం కొన్ని నిబంధనలు సూచించింది. దాని ప్రకారం రీసర్వే చేస్తాం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 3,672 మందిని గుర్తించాం. రీసర్వే అనంతరం ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తాం.

– కె.రవికుమార్, ఎఫ్‌డీఓ, ఇచ్ఛాపురం

క్రీడా విధానాలపై అవగాహన అవసరం



తవిటయ్యను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ : మారిన క్రీడా విధానాలపై అవగాహన పెంచుకోవాలని టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.తవిటయ్య చెప్పారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మొదటి జోన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో జరగనున్న పాఠశాల క్రీడల సమాఖ్య పోటీలను సమర్థంగా నిర్వహించాలన్నారు. అనంతరం తవిటయ్యను శిక్షకులు రామారావు, తిరుమల, దామోదర్ సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యదర్శి పి.గజేంద్ర, వివిధ మండలాల క్రీడా నిర్వాహకులు సీహెచ్ పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, పండా, కార్తికేయచౌదరి, పి.కృష్ణ, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా మరకతశివ దుర్గాదేవి



మరకత శివదుర్గాదేవి

టెక్కలి: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా టెక్కలి భవానీనగర్‌లోని శివ దుర్గా సమేత మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి శాకంబరి దేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు వాకాడ శ్రీధర్‌రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దొక్కరి దానయ్య

కాశీబుగ్గ : విద్యుత్ చౌర్యం జరిగిందంటూ టీడీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ దొక్కరి దానయ్య యాదవ్ మండిపడ్డారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. బహడపల్లిలో ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తనతో పాటు మాజీ మంత్రి అప్పలరాజు పీఏ జోగ కృష్ణారావు, బహడపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉమాపతి నివాసం, జీడి పరిశ్రమల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారని, ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వెనుదిరిగారని, అయితే నిజాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తారనే కనీస జ్ఞానం లేకుండా విమర్శించడం తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి తులసయ్య, సార దుర్వాసులు, బహడపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉమాపతి, సరియపల్లి సర్పంచ్ బత్తిని వెంకట్, సాలిన పాపారావు, కె.లక్ష్మీనారాయణ, మట్ట కూర్మారావు, మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనకు శుభరాట



శుభరాట వేస్తున్న గ్రామస్తులు

కంచిలి: మండలంలోని కత్తివరం గ్రామదేవత శ్రీశైలపుత్రి నడ్డమ్మతల్లి నూతన ఆలయ ప్రతిష్ఠాపనకు ఆదివారం శుభరాట వేశారు. ఆగస్టు 7 నుంచి 9 వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి పూజలు



కవిటి: జాడుపుడి ఆర్‌ఎస్‌లో పూజలందుకుంటున్న షిరిడీసాయి



టెక్కలి: శంభానవీధి మందిరంలో బాబాకు పూజలు చేస్తున్న అర్చకులు



వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురంలో బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



సోంపేట: రామకృష్ణా సేవాసమితి మందిరంలో గీతా పారాయణం



నందిగాం: షిరిడిసాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్ఛాపురం: పుష్పగిరిపై పూజలందుకుంటున్న షిర్డిసాయినాథుడు



కంచిలి: మకరాంపురం షిరిడి సాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు

గురు పౌర్ణమి సందర్భంగా షిర్డిసాయి మందిరాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే బాబాకు ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన సమారాధనలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

హాస్టల్ తరలింపునకు ఆదేశాలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ప్రకాష్‌నగర్ కాలనీలో ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ సముదాయంలో కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్చాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్‌కు హైస్కూల్ కిలోమీటరున్నర దూరం ఉన్నందున విద్యార్థినులు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, భవనం కూడా శిథిలావస్థకు చేరిందని ఏఎస్‌డబ్ల్యూ జి.విజయలక్ష్మి, హాస్టల్ వార్డెన్ శ్రీదేవి ఇటీవల మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

ఆకట్టుకున్న భగవద్గీత అష్టావధానం



అష్టావధానం నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు

పలాస: పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో ఆదివారం భగవద్గీత అష్టావధానం నిర్వహించారు. యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అవధానిగా హాజరై సభ్యుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వ్యక్తిత్వ వికాసం, భగవద్గీత ప్రాధాన్యతలను వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాని పంతులు, రామాజి, మల్లా రామేశ్వరం, ప్రీతీ చౌదరి, డోరి రామారావు, బూర్జ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు పైడిశెట్టి దినేష్

ఇచ్ఛాపురం: పట్టణ శివారులో ఉన్న వల్లభరాయ గెడ్డ శ్మశాన వాటికను మహాప్రస్థానంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక రోటరీ ఫంక్షన్‌హాల్లో ఆదివారం మహాప్రస్థానం నిర్మాణానికి సలహాలు, సూచనలు తీసుకునేందుకు పట్టణ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 3డీ ప్రాజెక్టును ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సభ్యులు

సంతబొమ్మాళి: వల్లేవలస గ్రామంలోని చిన్మయానంద ఆశ్రమంలో గురుపూర్ణమి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పి.షణ్ముఖరావు, రెడ్డి సూరిబాబు, పి.జోగారావు, పి.ధనుంజయకుమార్, ఆర్.శ్రీనివాసరావులను శాలువతో సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బాడాన రాజశేఖర్, భజరంగదళ్ అధ్యక్షుడు జి.శివారెడ్డి, శ్రీను స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి



అంబులెన్స్ పనితీరును తనిఖీ చేస్తున్న జగన్నాథరావు

కంచిలి/కాశీబుగ్గ:108 అంబులెన్స్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు అన్నారు. కంచిలి మండలంలో సేవలందిస్తున్న 108 అంబులెన్స్ పనితీరును ఆదివారం పరిశీలించారు. వాహన నిర్వహణ, పరికరాల పనితీరు, అత్యవసర మందుల నిర్వహణ రికార్డు, డ్యూటీ చార్టు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అంతకుముందు పలాస మండల కేంద్రంలో 108 అంబులెన్సును పరిశీలించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది బి.తారకేశ్వరరావు, పి.తిరుపతిరావు, ఎస్.రామచంద్రరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భగవంతుడే కాపాడాలి



ధనరాజుల తులసమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: నవ్యాంధ్రప్రదేశ్‌ను రావణ కాష్టంగా మార్చేస్తున్న కూటమి ప్రభుత్వం చెర నుంచి రాష్ట్రాన్ని భగవంతుడే కాపాడాలని ఎమ్మెల్సీ నర్తు రామారావుయాదవ్ అన్నారు. ఆదివారం లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అడ్డూ అదుపు లేకుండా దాడులు కొనసాగుతుండడటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దాడులపై దృష్టి పెట్టకుండా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు.

28న కాశీబుగ్గలో జిల్లా మహాసభలు

వజ్రపుకొత్తూరు రూరల్: కాశీబుగ్గలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా 31వ మహాసభలను విజయవంతం చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి డి.మహారణ, కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సీహెచ్ నేతాజీ, జగదీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

డెంగీతో యువకుడు మృతి



విఘ్నేష్‌రెడ్డి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని దానంపేటకు చెందిన తిప్పన విఘ్నేష్‌రెడ్డి (21) అనే యువకుడు డెంగీ జ్వరం బారిన పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దానంలోపేటలో నివాసముంటున్న మాజీ సైనికాధికారి తిప్పన రమణయ్య, రాణిల కుమారుడు విఘ్నేష్. ఇతను విశాఖలో బీటెక్ చదువుతున్నాడు. అక్కడే అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై విశాఖలోనే మృతిచెందాడు.

ఆధ్యాత్మిక భావన అవసరం

టెక్కలి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని కవిటికి చెందిన ఆధ్యాత్మికవేత్త బందరు దుర్గాప్రసాద్, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మూల తాతయ్య, ఊడికలపాడు రామకృష్ణ రమణ కరుణ గీతాశ్రమానికి చెందిన సనపల కరుణ్‌కుమార్ అన్నారు. వ్యాస మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం టెక్కలి మండలం సీతాపురంలోని ప్రసన్న సీతారామాంజనేయ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సత్సంగంలో వారు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం బెండి అప్పలసూర్యనారాయణ, సత్సంగ నిర్వాహకులు బెండి సుధాకర్, బెండి నాగు, బెండి శ్రీను, చింతాడ పార్వతీశం పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ శిబిరాలు

కోటబొమ్మాళి: మండలంలోని 27 సచివాలయాల పరిధిలో ఈ నెల 23 నుంచి 27 వరకూ ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24, 25 తేదీల్లో కొత్తపల్లి, నీలంపేట, నిమ్మాడ, తర్లిపేట, తిలారు, 26, 27న కొత్త పేట, చిన్నసాన, కిష్టుపురం సచివాలయాల్లోనూ శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అవసరమైన వారు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.